క్రీడలతో మానసికోల్లాసం

- అక్కన్నపేట ఎస్సై వివేక్
- అంతక్కపేట శివారులో జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై వివేక్


హాజరైన క్రీడాకారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎస్సై తాండ్ర వివేక్ అన్నారు. మండలంలోని అంతక్కపేట శివారు మర్రికుంట వద్ద జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించగా.. ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. క్రీడలతో శారీరక ధార్ఢ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. సమాజంలో మంచి గుర్తింపు సైతం ఉంటుందని పేర్కొన్నారు. హుస్నాబాద్ ప్రాంతం క్రీడలకు అడ్డా అని కొనియాడారు. జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీల్లో సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి గుగులోతు రంగనాయక్, హెచ్ఎం చంద్రశేఖర్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆర్థిక కార్యదర్శి చింతకింది శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ రజిత రవి, ఖేల్ ఇండియా శిక్షకులు సంజీవ్, పీఈటీలు సుధారాణి, వీరస్వామి, చౌటపల్లి సర్పంచ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు..

అండర్–14 బాలికల విభాగంలో రిజ్వాన, వర్షిత, లిఖిత, కావ్య, హారిక, సిరి, చందన. అండర్–16లో హర్షిత, రవళి, దుర్గ, స్నేహ, కావ్య విజేతలుగా నిలిచారు. అండర్–14 బాలుర విభాగంలో నిఖిల్, పవన్, సుప్రీత్, ప్రసాద్, చరణ్.. అండర్–16లో సుమిత్, బస్వంత్, హర్షవర్ధన్, ప్రసాద్, రఘువంశీ విజేతలుగా నిలిచారు.

క్లుప్తంగా

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి కోరారు. బుధవారం వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు, బదిలీలను వెంటనే చేపట్టాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు మహమూద్, నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు రాజేందర్, సీనియర్ నాయకులు జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాలవికాస సేవలు మరువలేనివి

హుస్నాబాద్: బాలవికాస సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం అనాథ వృద్ధుల ఆదరణ దినోత్సవం సందర్భంగా 20 మంది వృద్ధులకు రూ. 2 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు, చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల వికాస సేవా సంస్థ ఎంతో మంది అభాగ్యులను అక్కున చేర్చుకొని సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాల వికాస సంస్థ వాటర్ ప్లాంట్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, కౌన్సిలర్ చిత్తారి పద్మ, వాటర్ ప్లాంట్ అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, బాల వికాస కో ఆర్డినేటర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు


భూసార పరీక్షలు నిర్వహిస్తున్న ఏఈఓ ప్రవీణ్

దౌల్తాబాద్(దుబ్బాక): రైతులు పంట పొలాల్లో భూసార పరీక్షలు చేసుకొని అధిక దిగుబడులు పొందాలని ఏఈఓ ప్రవీణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కోనాపూర్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి మూలాధారం మట్టి కాబట్టి.. దానిని జాగ్రత్తగా కాపాడుకుని భావితరాలకు ఆరోగ్యవంతమైన నేలను అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సలహాలు పాటించాలి


వరి నారును పరిశీలిస్తున్న ఏఓ వసంతరావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): చలికాలంలో వరి నారు రక్షణ కోసం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ వసంతరావు అన్నారు. బుధవారం మండలంలోని దౌలాపూర్‌లో వరి నారును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలికాలంలో యాసంగి నార్లు పోయడం వల్ల నారు దక్కే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని సూచించారు.

కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


గెలుపొందిన విద్యార్థినులతో ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి(తూప్రాన్): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని మానెపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో 21 మంది పాల్గొన్నారు. అందులో ఎనిమిది గోల్డ్, ఎనిమిది సిల్వర్, ఐదు కాంస్య పతకాలతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. విద్యార్థులను బుధవారం ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి అభినందించారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన కోచ్ స్వప్నను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవి, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ పోతిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం


చిన్నకోడూరు: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు


కొండపాక: మాట్లాడుతున్న సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి

చిన్నకోడూరు(సిద్దిపేట)/కొండపాక(గజ్వేల్): ఉద్యోగులకు బదిలీలు సహజమని, విధి నిర్వహణలో చేసిన పనులు చిరస్థాయిగా నిలుస్తాయని సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాముని పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జగన్, శ్రీనివాస్, గౌరారెడ్డి బదిలీపై వెళ్లగా వారిని సన్మానించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వనజ, ఉమారాణి, రాజయ్య, బాలకృష్ణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కుకునూరుపల్లి మండలం మంగోల్ హైస్కూల్ పీజీ హెచ్ఎం రాంచంద్రంతో పాటు ఉపాధ్యాయులు నర్సింలు, రవీందర్ బదిలీపై వెళ్లడంతో బుధవారం ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గత ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సత్తయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిని నియమించండి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

దౌల్తాబాద్(దుబ్బాక): బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్‌ను తొలగించి సీనియర్ నాయకుడిని అధ్యక్షుడిగా ప్రకటించాలని జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు రహిమొద్దీన్, మల్లేశంపల్లి సర్పంచ్ సత్యనారాయణ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా రణం శ్రీనివాస్‌గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారన్నారు. ఆయన భార్య జ్యోతి ప్రస్తుతం జెడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్నారని తెలిపారు. నూతన అధ్యక్షుడిని నియమించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహన్‌రావు, నర్రా రాజేందర్, గాజులపల్లి సర్పంచ్ శ్రీనివాస్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల లీకేజీ పరిశీలన


లీకేజీ నీటిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ మహేష్

సాక్షి ఎఫెక్ట్

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలోని దుడ్డె చెరువు, నల్ల చెరువు లీకేజీలను బుధవారం ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండు చెరువుల లీకేజీతో చెరువు కింది భాగంలో ఉన్న పంట పొలాల్లోకి నీరు చేరుతోంది. దీంతో వరి కోతలు కోయడంలో రైతులు పడుతున్న ఇబ్బందులను ఈనెల 14వ తేదీన 'కష్టాల్లో ముంచేను' అనే కథనాన్ని సాక్షి ప్రచురించింది. దీనికి స్పందించిన ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఈఈ మహేష్, ఏఈ వెంకటేశ్వర్‌రావు దుడ్డె చెరువులో నీటి నిల్వ ఎక్కువగా ఉండడంతో లీకేజీ అవుతుందని.. నల్ల చెరువకు రెండు చోట్ల ఉన్న తూంలకు ఆన్ ఆఫ్ గేట్ వాల్వులు లేకపోవడంతో తూంల నుంచి నీరు లీకేజీ అవుతుందని గుర్తించారు. ఈసందర్భంగా ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ మహేష్ మాట్లాడుతూ.. విషయాన్ని అధికారులకు నివేదించి పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం లీకేజీతో నష్టపోతున్న రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

13 మందిపై కేసు

కొమురవెల్లి(సిద్దిపేట): సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్న ఘటన కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. బుధవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువన్నపేట ఉప సర్పంచ్ తుక్కొజు నర్సింహులు కుటుంబం తనపై దాడి చేసిందని సర్పంచ్ భర్త పరుశరాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా సర్పంచ్ భర్త పరుశరాములు అనుచరులతో ఇంటికొచ్చి తమ కుటుంబ సభ్యులపై దాడి చేసినట్లు ఉప సర్పంచ్ నర్సింహులు పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేశారు. నర్సింహులు కుమారుడి వ్యక్తిగత విషయానికి సంబంధించిన ఆడియోను గ్రామానికి చెందిన సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతోనే సర్పంచ్ , ఉప సర్పంచ్ కుటుంబాల మధ్య గొడవ జరిగినట్లు తెలిపారు. ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేయడంతో 13 మంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ భూమిపూజ

తొగుట(దుబ్బాక): మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ప్రహరీ నిర్మించేందుకు ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 15వ ఫైనాన్స్ నిధుల ద్వారా రూ. 5 లక్షలతో ప్రహరీ నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే ఆవరణలో సీసీ నిర్మాణం కోసం రూ. 2 లక్షలు, కమాన్ నిర్మించేందుకు మరో రూ. 2 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ పాగాల కొండల్‌రెడ్డి, ఎంపీటీసీలు స్వామి, కనకలక్ష్మీ నారాయణ, మాజీ ఎంపీటీసీ రమేష్, ఎంపీడీఓ శ్రీధర్, ఏపీఓ కిషన్, టీఏ శ్రీనివాస్, టీపీసీసీ ఫిషర్‌మెన్ కార్యదర్శి తిరుపతి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు స్వామి పాల్గొన్నారు.

◆ కేంద్ర పథకాలపై అవగాహన

మద్దూరు(హుస్నాబాద్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై మండలంలోని వల్లంపట్లలో ఏపీజీవీబీ బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్ ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆలేటి రజిత యాదగిరి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ నిత్యావసరాల పంపిణీ

బెజ్జంకి(సిద్దిపేట): అనాథ వృద్ధుల ఆదరణ దినోత్సవాన్ని బుధవారం మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌లో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బెజ్జంకి, కోహెడ, ఇల్లంతకుంట, చిన్నకోడూర్, తిమ్మాపూర్ మండలాలకు చెందిన 40 మంది వృద్ధులకు నూతన దుస్తులు, 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ మాట్లాడుతూ.. అనాథ వృద్ధులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్ ప్రశాంత్, దాతలు సత్యం, సతీష్, బాలవికాస సంస్థ సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం తగదు

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ మండిపడ్డారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి బీఆర్ఎస్ బీ టీంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్‌పై దుష్ప్రచారానికి ఒడిగడుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.

◆ మెరుగైన ఫలితాలు రావాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీం సభ్యురాలు సునంద అన్నారు. బుధవారం శివ్వంపేట జెడ్పీ పాఠశాలలో 'ఉన్నతి లక్ష్య' అమలు తీరును పరిశీలించారు.


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

సకాలంలో పనులు పూర్తి చేయాలి

హుస్నాబాద్ పట్టణంలో చేపడుతున్న మన ఊరు– మన బడి పనులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రూ. 56 లక్షలతో నిర్మిస్తున్న భోజనశాల, టాయిలెట్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక నిధులు వెచ్చిస్తుందన్నారు. మన ఊరు– మన బడితో సర్కారు బడుల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. ప్రభుత్వం కల్పించే విద్యా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, హెచ్ఎం వెంకటయ్య, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం

తొగుట(దుబ్బాక): శీతాకాల సమయంలో పశువుల ఆరోగ్యంపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి నిహారిక సూచించారు. మండల పరిధిలోని రాంపురంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల ఆంజనేయులు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ భాస్కర్, గోపాల మిత్ర మహేందర్‌రెడ్డి, వాజిద్, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్ఐ దామోదర్

చేర్యాల(సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను 'సీఈఐఆర్' టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు. బుధవారం ఎస్ఐ మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఆకునూరుకు చెందిన జాల సంజీవరెడ్డి రెడ్‌మీ కంపెనీకి చెందిన ఫోన్‌ను జూలై 28వ తేదీన పోగొట్టుకున్నాడు. ప్రభుత్వం నూతనంగా తెచ్చిన వెబ్‌సైట్‌లో సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఎంటర్ చేసి, బ్లాక్ చేశాడు. ఫోన్ దొరికిన వ్యక్తి సెల్‌ఫోన్‌లో సిమ్‌కార్డు వేయగానే వెబ్‌సైట్ ద్వారా వివరాలు స్థానిక పోలీసులకు చేరాయి. వెంటనే ఫోన్‌ను దొరికిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా బ్లాక్ చేసి తద్వారా తిరిగి పొందవచ్చని తెలిపారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి


రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

నంగునూరు(సిద్దిపేట): కంది పంటకు తెగులు సోకినట్లు గుర్తిస్తే మందు పిచికారీ చేయడంతోపాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం తోర్నాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం వరంగల్ శాస్త్రవేత్తలు పల్లవి, కిషోర్, వీరన్న, మధు అన్నారు. ముండ్రాయిలోని రైతు కర్నాకర్‌రెడ్డి సాగు చేసిన కంది పంటను బుధవారం శాస్త్రవేత్తలు పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కంది పంటలో కాయతొలుచు పురుగు ఆశిస్తున్నట్లు గుర్తించామన్నారు. గుడ్ల నుంచి వచ్చిన తెల్లపురుగు గింజలో చారలు, గుళ్లు కట్టుకొని గింజను తింటాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అశోక్ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

పంజ చంద్రయ్య తండ్రి మల్లయ్య, వయసు 67 సం., ఇంటి నం.5–21, ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామం, తొగుట మండలం, ప్రస్తుతం R&R కాలనీ, ఏటిగడ్డ కిష్టాపూర్, గజ్వేల్ మండలం, సిద్దిపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రం నివాసియైన నేను ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా సిద్దిపేట జిల్లా, దౌల్తాబాద్ మండలం, దిమ్మట గ్రామంలో గల సర్వే నం.లు 1143అ3(0–1350), 1145అ3(0–1650), 1150అ3(0–0825), 1302ఇ(1–0375) మరియు 1303ఇ(0–3375)లో భూమికి సంబంధించిన ఖాతా నం. 853, నం. T10050031392 కలిగిన పట్టా పాస్‌బుక్ R&R కాలనీ, ఏటిగడ్డ కిష్టాపూర్ నుండి గజ్వేల్‌కు ప్రయాణం చేసే సమయంలో పోయినది. ఈ పాస్‌బుక్ ఎవరికైనా దొరికినచో ఫోన్ చేయగలరు.
సెల్ : 9948928231

బడి బయట పిల్లల గుర్తింపు


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు బుధవారం ఎంఈఓ పావని కూరెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం, ఉన్నతి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. అలాగే ఇటుక బట్టీల వద్ద ఉన్న పిల్లల కోసం వర్క్ సైట్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు రాజేశం తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక


సందీప్‌తో పీఈటీ గోవర్ధన్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన క్రీడాకారుడు సందీప్ ఎంపికైనట్లు ఏటిగడ్డ కిష్టాపూర్ జెడ్పీహెచ్ఎస్ పీఈటీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ స్థాయి వాలీబాల్ సెలక్షన్స్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన సందీప్ సౌత్ జోన్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కర్ణాటకలోని బెల్గవిలో గల విశ్వేశ్వరయ్య టెక్నాలజీకల్ యూనివర్సిటీలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు


నంగునూరు: గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

నంగునూరు(సిద్దిపేట): కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో చిన్నారికి తీవ్ర గాయాలైన సంఘటన నంగునూరులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన కొన్ని కుటుంబాలు చేర్యాలలో బొగ్గు బట్టీలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం బస్వాపూర్ నుంచి చేర్యాలకు ట్రాక్టర్‌లో కట్టెలు తరలిస్తుండగా నంగునూరు శివారులో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. అందులో ఉన్న వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మికి గాయాలు కాగా చిన్నారి అంకమ్మ (4) తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి సిద్దిపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బస్సు నుంచి జారి పడి విద్యార్థిని..

మిరుదొడ్డి(దుబ్బాక): ఆర్టీసీ బస్సులో నుంచి జారి పడడంతో విద్యార్థిని గాయపడింది. ఈసంఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అక్బర్‌పేటకు చెందిన రాజు రజిత దంపతుల రెండో కుమార్తె స్పందన నిజాంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లడానికి అక్బర్‌పేట బస్ స్టేజీ వద్దకు వచ్చింది. కాగా మెదక్ డిపోకు చెందిన బస్సు సిద్దిపేట నుంచి మెదక్‌కు వెళుతూ అక్బర్‌పేట స్టేజీ వద్ద ఆగింది. అప్పటికే బస్సులో విపరీతమైన రద్దీ ఉంది. పాఠశాల సమయం మించి పోతుందన్న ఆత్రుతలో తోటి విద్యార్థులతో కలిసి ఫుట్‌బోర్డుపై ఎక్కి నిల్చుంది. బస్సు కదిలి వెళుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయింది. గమనించని డ్రైవర్ బస్సును అలాగే ముందుకు పోనిచ్చాడు. సదరు విద్యార్థిని కింద పడినప్పటికి డ్రైవర్ బస్సు ఆపలేదంటూ కొందరు బస్సును వెంబడించి నగరం బస్టాప్ వద్ద బస్సును నిలిపి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న భూంపల్లి పోలీసులు ప్రయాణికులకు నచ్చజెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. కాగా గాయాల పాలైన విద్యార్థిని తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లారు.

ట్రాక్టర్, బైక్ ఢీ: యువకుడికి గాయాలు


గాయాలతో యువకుడు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ట్రాక్టర్ బైక్ ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని మునిగడపలో బుధవారం రాత్రి జరిగింది. మండలంలోని గొల్లపల్లికి చెందిన రాంచంద్రం తన బైక్‌పై మునిగడపకు వెళ్తున్న క్రమంలో ప్రభుత్వ పాఠశాల సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాంచంద్రం కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు.

ఈ- కేవైసీకి తప్పని ఇక్కట్లు


హెచ్‌పీ గ్యాస్ డీలర్ ఆఫీసు వద్ద క్యూలో వినియోగదారులు

నర్సాపూర్: వంట గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ చేయించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గ్యాస్ డీలర్ ఆఫీసు వద్ద నిత్యం క్యూ కడుతున్నారు. బుధవారం కూడా వినియోగదారులు బారులుతీరారు. నర్సాపూర్‌లోని హెచ్‌పీ గ్యాస్ డీలర్ ఆఫీసులో ఈకేవైసీ నమోదు చేయించుకునేందుకు ఆయా గ్రామాల వినియోగదారులు తరలివచ్చారు. దీంతో తమ వంతు వచ్చే వరకు నిరీక్షించారు.